

విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ప్రిన్సిపాల్ శివ రామకృష్ణ, అధ్యాపకులు

## మల్యాల ప్రభుత్వ అధ్యాపకుల ఔదార్యం

మల్యాల, జనవరి 5 : మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మండలంలోని ఎనిమిది నుంచి పది గ్రామాల విద్యార్థులు వస్తున్నారు. ఉదయం 9 గంటలకు వస్తే సాయంత్రం 4.30 వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. అయితే, పిల్లలు ఉదయమే వస్తుండడంతో చాలా వరకు లంచ్ బాక్స్ తెచ్చుకోవడం లేదు. దీంతో ఆకలికి తట్టుకోలేక సాయంత్రం దాకా పాఠాలు వినడం లేదు. మధ్యాహ్న సమయంలోనే తిరిగి ఇండ్లకు వెళ్లిపోతున్నారు. ఈ క్రమంలో ఇక్కడి అధ్యాపకులు ఔదార్యం చాటారు. తమ కాలేజీకి వచ్చే 250 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తరహాలో అల్పాహారం అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు అధ్యాపకులతోపాటు బోధనేతర సిబ్బంది తమవంతు సహాయంగా కొంత నగదును సమకూర్చుకున్నారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచే ప్రారంభించారు. మొదటి రోజు వంద మంది విద్యార్థులకు భోజనం, మరో వంద మంది విద్యార్థులకు ఉప్మా అందించారు. అల్పాహారం కార్యక్రమాన్ని వార్షిక పరీక్షల (మార్చి ఒకటో తేదీ) వరకు కొనసాగిస్తామని ప్రిన్సిపాల్ శివరామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమలో అధ్యాపకులు అత్తినేని శ్రీనివాస్, శ్రీధర్, శ్రీనివాస్, రచన, పూర్ణిమ, సంధ్య, నరేశ్ పాల్గొన్నారు.



హరిదాసుకు ధాన్యం దానం చేస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

## వైభవంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

సుల్తానాబాద్, జనవరి 5: సంక్రాంతి ముందస్తు వేడుకలు అప్పుడే మొదలయ్యాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో సంబురంగా సాగుతున్నాయి. శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో వైభవంగా జరిగాయి. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, పిండి వంటల తయారీ, వ్యవసాయ పనులు బొమ్మల కొలువులతో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల అధినేత వీ నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మన పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు.



నర్మాల ఎగువ మానేరు కాలువను పరిశీలిస్తున్న కొండూరి రవీందర్‌రావు, నాయకులు, రైతులు

## మానేరు కాలువలో పూడికతీత

**సొంత ఖర్చులతో చేయిస్తున్న నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు**

గంభీరావుపేట, జనవరి 5 : గంభీరావుపేట మండలం నర్మాలలోని ఎగువమానేరు ప్రాజెక్టు ఎడమ కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఈ క్రమంలో ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు గానూ నాఫ్స్‌కాబ్ కొండూరి రవీందర్‌రావు సొంత ఖర్చులతో రెండు కిలోమీటర్ల మేర పూడికతీత పనులు చేయిస్తున్నారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయని, రైతులు సాగును ప్రారంభించుకోవచ్చని ఆయన చెప్పారు. మానేరు నుంచి వచ్చే ప్రతి నీటి బొట్టునూ వృథా కానివ్వద్దనే ఉద్దేశంతో పూడికతీత పనులు చేపట్టామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పూడికతీత పనులను పరిశీలించగా, అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు, పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

వేసిన ముగ్గు వద్ద నాగదుర్గ

## అలరించిన రంగవల్లులు

**ప్రత్యేక ఆకర్షణగా ఫోక్ డ్యాన్సర్ నాగదుర్గ**

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జనవరి 5 : కరీంనగర్‌లోని వాసవి ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఫోక్ డ్యాన్సర్ నాగదుర్గ ముఖ్యఅతిథిగా హాజరు కాగా, డాక్టర్ మౌనిక, సూర గీత న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన కే వరలక్ష్మికి మొదటి బహుమతి కింద ఆరు గ్రాముల బంగారం, కరీంనగర్‌కు చెందిన గౌరిశెట్టి రజితకు రెండో బహుమతి కింద మూడు గ్రాముల బంగారం, రుద్రసేని పద్మకు మూడో బహుమతి కింద రెండు గ్రాముల బంగారం అందజేశారు. పోటీలో పాల్గొన్న మహిళలకు కన్సోలేషన్ బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో కాచం రాజేశ్వర్, కోశాధికారి బొల్లం శ్రీనివాస్, డైరెక్టర్లు తాటిపెల్లి సుభాష్, రాచమల్ల భద్రయ్య, రామిడి శ్రీనివాస్, పాత కృష్ణమూర్తి, పల్లెర్ల శ్రీనివాస్, పల్లెర్ల రాజకీయం, పల్లెర్ల వేణుగోపాల్, నల్ల మహేందర్, పాల్తపు శ్రీనివాస్, పాల్తపు మల్లికార్జున్, వెంకటేశ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

## టీ-నేతన్న యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**చేనేత, జౌళీశాఖ సహాయ సంచాలకుడు ఎం సాగర్**



సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 5: ప్రభుత్వం రూపొందించిన టీ-నేతన్న యాప్‌ను కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళీశాఖ సహాయ సంచాలకుడు ఎం సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. టీ-నేతన్న అప్లికేషన్‌ను జియో ట్యాగింగ్ కలిగి, వృత్తిపై ఆధారపడిన ఆసాములు, అనుబంధ కార్మికులు గూగుల్ ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాల్లో సమస్యలున్నా, పథకాలు అందకపోయినా, ఆయా స్కీమ్‌లకు ఉన్న అర్హత, తదితర వివరాలను యాప్ ద్వారా తెలుసుకొనే అవకాశం ఉందన్నారు. పథకాల్లో మార్పులు, చేర్పులు జరిగిన వెంటనే ఎస్‌ఎంఎస్ ద్వారా మెసేజ్‌లు వస్తాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ వస్త్ర ఉత్పత్తి ఆర్డర్ల వివరాలు ఈ యాప్‌ను నమోదైన ఆసాములకు మాత్రమే అందిస్తామని తెలిపారు. మరమగ్గాల ఆసాములు, అనుబంధ కార్మికులందరూ టీ-నేతన్న యాప్‌లో ఈనెల 10లోగా పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.



# కొందరికే వేతనాలు



- ఐదో తేదీ వరకు కొన్ని ప్రభుత్వ శాఖలకే చెల్లింపులు
- ఇంకా చాలా శాఖలకు అందని జీతాలు
- కాంగ్రెస్ ఇచ్చిన హామీని గుర్తు చేస్తున్న ఉద్యోగులు

**తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తారీఖునే వేతనాలు చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించింది. మ్యానిఫెస్టోలోనూ ఆ హామీని పొందుపరిచింది. కానీ, ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఎంతో మంది వేతన జీవులకు నిరాశే మిగిలింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొందరికే వేతనాలు చెల్లించినట్టు తెలుస్తుండగా, చాలా శాఖల ఉద్యోగులకు ఇప్పటి వరకు జీతాలు పడలేదు. ఐదో తారీఖు దాటినా ఎదురుచూపులు తప్పడం లేదు. తమ ఫోన్లలో ఏ మెసేజ్ వచ్చినా ఆత్రుతగా చూసుకోవడం కనిపిస్తున్నది. అయితే కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో అందరికీ వేతనాలు విడుదలైనట్లు ప్రచారం జరుగుతుండగా, ప్రభుత్వ ఉద్యోగులే దీనిని ఖండిస్తున్నారు. అనేక మంది తిరిగి కౌంటర్లు ఇవ్వడంతో పెట్టిన పోస్టులు తొలిగిస్తున్నారు.**

పెద్దపల్లి, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని వివిధ శాఖల హెచ్‌వోడీలు 010 పద్దు కిందికి వచ్చే బిల్లులు చేసి ట్రెజరీలకు సమర్పించారు. అయితే, వీటిలో ఒకే జిల్లా పరిధిలో ఉన్న ఎస్టీవోల్లో ఒకదాని పరిధిలో వేతనాలు వచ్చాయి. మరో దాని పరిధిలో ఇప్పటివరకు రాలేదు. సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ సబ్ ట్రెజరీ ఆఫీస్ (ఎస్టీవో)లో అన్ని శాఖల ఉద్యోగులకు వేతనాలు వచ్చినా.. అదే సిరిసిల్ల ఎస్టీవో పరిధిలో ఒక్క శాఖకు కూడా ఇప్పటి వరకు పడలేదు. ఇక జగిత్యాల జిల్లా పరిధిలోని మెట్‌పల్లి ఎస్టీవోలో వేతనాలు చెల్లించినా.. జగిత్యాల, కోరుట్ల, మల్యాల ఎస్టీవో పరిధిలో ఇంకా అందలేదు. పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఎస్టీవో పరిధిలో ఉద్యోగులకు వేతనాలు చెల్లించారు. పెద్దపల్లి, మంథని ఎస్టీవో పరిధిలో ఉన్న రెవెన్యూ, వైద్య విధాన పరిషత్తు ఉద్యోగులకు మాత్రమే వేతనాలు అందించారు. మిగతా శాఖలకు ఇంకా చెల్లించలేదు. ఇక కరీంనగర్ జిల్లాలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ జిల్లాలో కరీంనగర్‌లో డీటీవో, గంగాధర, హుజూరాబాద్, జమ్మికుంటలో ఎస్టీవో కార్యాలయాలు ఉన్నాయి. ఒక్క కరీంనగర్ డిస్ట్రిక్ ట్రెజరీ ఆఫీస్ (డీటీవో)లో వైద్య విధాన పరిషత్తు ఉద్యోగులకు మాత్రమే వేతనాలు అందాయి. మిగతా అన్ని ఎస్టీవోల పరిధిలో ఒక్క శాఖకు కూడా వేతనాలు ఇవ్వని పరిస్థితి ఉన్నది. అయితే, అన్ని ట్రెజరీల్లో విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ మాత్రం ఇచ్చారు. ఇక చెక్కుల ద్వారా వేతనాలు పొందే ఉద్యోగుల వేతనాల ఊసే లేకపోవడంతో సదరు ఉద్యోగులు నిరాశకు గురవుతున్నారు.

**ఖండించిన ఉద్యోగులు!**

చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఇంకా వేతనాలు అందక ముందే కొన్ని పత్రికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఉద్యోగులకు మొదటి తారీఖున వేతనాలు అందినట్టు అర్థం వచ్చేలా కొన్ని పత్రికలు రాతలు రాస్తున్నాయి. సోషల్ మీడియాలోనూ పోస్టులు అలాగే, వైరల్ అవుతున్నాయి. కానీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉండగా, ఆ అసత్య ప్రచారాన్ని అనేక శాఖల ఉద్యోగులే ఖండిస్తున్నారు. ఉద్యోగులు ఇచ్చే నెగటివ్ కౌంటర్లతో ఆ పోస్టులు డిలీట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' వాస్తవాలను పరిశీలించే ప్రయత్నం చేయగా, శుక్రవారం వరకు కొన్ని శాఖల ఉద్యోగులకే వేతనాలు అందినట్టు తెలిసింది. ఇంకా చాలా శాఖలకు చెందిన ఉద్యోగులు ఎదరుచూస్తున్నారు. గతంలో జిల్లాల వారీగా ఉన్న ఉద్యోగులకు వేతనాలు విడుదల చేసినా.. ఇప్పుడు ఆ పరిస్థితి కూడా కనిపించలేదు. ఎస్టీవో కార్యాలయాల వారీగా వేతనాలు ఇస్తున్నట్టు స్పష్టమైంది.

# భవిత కేంద్రాలకు భరోసా

- కొత్త సెంటర్లల్లో సామగ్రి కొనుగోలుకు ₹7లక్షలు మంజూరు



పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని భవిత కేంద్రం

**ప్రత్యేక అవసరాలు గల పిల్లల వికాసం కోసం ప్రభుత్వం భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 47మండలాల్లో కేంద్రాలు ఉండగా, కొత్తగా ఏర్పాటైన 14 మండలాల్లోనూ గతేడాది ఈ సెంటర్లను ప్రారంభించింది. అవసరమైన సామగ్రి (బోధనోపకరణాలు, ఆట వస్తువులు, కుర్చీలు) కొనుగోలు చేసేందుకు ఒక్కో కేంద్రానికి ₹50వేల చొప్పున నిధులు మంజూరు చేసింది.**

**ఉత్తర్వులు వచ్చాయి**



పెద్దపల్లి జిల్లాలోని భవిత కేంద్రాల్లో 745 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. కొత్తగా ఏర్పాటైన భవిత కేంద్రాల్లో సామగ్రి కొనుగోలు కోసం ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఈ నిధులు రాగానే ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. వారి నిర్ణయం మేరకు సామగ్రి కొనుగోలు చేస్తాం.

-మాధవి, డీఈవో (పెద్దపల్లి)

పెద్దపల్లి, జనవరి 5(నమస్తే తెలంగాణ): మానసిక, శారీరక వైకల్యం ఉన్న బాలబాలికలకు వివిధ పద్ధతుల్లో విద్యనందించి సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం విలీన విద్యా వనరుల కేంద్రాలను (ఐఈఆర్సీ) ఏర్పాటు చేసింది. బుద్ధి మాద్యం, శారీరక వైకల్యంతో బాధపడుతున్న వారితో మాట్లాడించడం, నడిపించడం, ప్రాథమిక విద్యను అందించేందుకు నిపుణులను గతంలోనే నియమించింది. అలాగే కొత్తగా ఏర్పడిన 14 మండల కేంద్రాల్లోనూ ఏడాది క్రితం సెంటర్లను ప్రారంభించింది. ఆ కేంద్రాల్లో అవసరమైన సామగ్రిని సమకూర్చేందుకు ఒక్కో సెంటర్‌కు ₹50వేల చొప్పున మొత్తం ₹7లక్షలు ఇటీవలే మంజూరు చేసింది. పెద్దపల్లి జిల్లాలో మూడు, కరీంనగర్ జిల్లాలోని నాలుగు, జగిత్యాల జిల్లాలో మూడు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో నాలుగు మండలాలకు నిధులు కేటాయించింది. ఈ నిధులతో భవిత కేంద్రాల్లో బోధనోపకరణాలు, ఆట వస్తువులు, కుర్చీలు, బల్లలు, బీరువాలు సమకూర్చుకునే అవకాశమున్నది. అలాగే ఇంటి వద్ద ఉంటూ చదువుకునే వారిలో జిజ్ఞాస పెంపొందించేందుకు ప్రత్యేక నిధులు ఇచ్చింది.



పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభలో అభివాదం చేస్తున్న డాక్టర్ పిడమర్తి రవి, నాయకులు

## బీజేపీ.. దళిత వ్యతిరేకి

**• ఎన్నికల కోసమే కపట నాటకాలు • పెద్దపల్లి, వరంగల్ పార్లమెంట్ టికెట్లు మాదిగలకే కేటాయించాలి • ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి**

పెద్దపల్లి టౌన్, జనవరి 5: బీజేపీ దళితజాతి వ్యతిరేక పార్టీ అని, ఎన్నికల కోసమే ఆ పార్టీ కపట నాటకాలు ఆడుతున్నదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి మండిపడ్డారు. మాదిగ శక్తి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కమాన్ నుంచి అయ్యప్ప ఆలయం మీదుగా బస్టాండ్ వరకు డప్పు మహిళా కళాకారులతో పెద్దఎత్తున ర్యాలీ తీశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన సభలో పిడమర్తి రవి మాట్లాడారు. బీజేపీ అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నదని, అధికారంలోకి రాగానే ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని చెప్పినా నేటికి చేయలేదని మండిపడ్డారు. జనాభా దమాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీ నాయకులు పెద్దపల్లి, వరంగల్ పార్లమెంట్ స్థానాల టికెట్లు మాదిగలకు మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నుంచి పెద్దపల్లి పార్లమెంట్ టిక్కెట్ ఉద్యమ నాయకుడు గజ్జెల కాంతంకు ఇవ్వాలన్నారు. తెలంగాణలోని మాదిగ జాతి ఏకమై పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మొదలైన మాదిగ శక్తి ర్యాలీలు త్వరలోనే ఢీల్లీ, హైదరాబాద్, తదితర జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మాదిగ శక్తి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర చైర్మన్ వక్కళ్ల సోమచంద్రశేఖర్, నాయకులు కల్లెపల్లి రవి, క్కు కనకరాజు, బొంకూరి నరేందర్, కుక్క నారాయణ, తాళ్లపల్లి అంజయ్య, నర్సయ్య, కుమ్మరి సందీఫ్, అజయ్, దూడ భూమయ్య, మాచర్ల బబ్లూ, సలిగంటి చిన్న, మంథని సత్యం, కమల, అశోక్, మంథని లక్ష్మణ్, నరేశ్, రాజు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

## మల్యాలలో వాలీబాల్ టోర్నమెంట్

- **ఈ నెల 16, 17తేదీల్లో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహణ • పోస్టర్ ఆవిష్కరించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

చందుర్తి, జనవరి 5: ఉమ్మడి కరీంగనర్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను చందుర్తి మండలం మల్యాలలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పోటీల నిర్వహణకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆవిష్కరించారు. వాలీబాల్ యూత్ అసోసియేషన్ మల్యాల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నామని, విజేతలకు కేసీఆర్ కప్‌తోపాటు నగదు బహుమతులు అందిస్తామని బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఈర్లపల్లి రాజు తెలిపారు. పూర్తి వివరాల కోసం వినయ్ (77319-28884), అభి (86884-93277, 70953-53096)ని సంప్రదించాలని ఆయన సూచించారు.



ఒడ్డెర కాలనీలో గ్రామస్తులతో మాట్లాడుతున్న పరిశీలకురాలు దేవసేన, అదనపు కలెక్టర్ దివాకర్

## 'ప్రజా పాలన' నిరంతర ప్రక్రియ

- **ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి**
- **ఉమ్మడి జిల్లా పరిశీలకురాలు దేవసేన**

జగిత్యాల రూరల్, జనవరి 5: ప్రజా పాలన నిరంతర ప్రక్రియ అని, ఇక నుంచి నాలుగు నెలలకోసారి నిర్వహిస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజా పాలన పరిశీలకురాలు దేవసేన పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెర కాలనీ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ దివాకర్‌తో కలిసి ఆమె పరిశీలించారు. దరఖాస్తుదారులతో కాసేపు మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలన నిరంతర కార్యక్రమమని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ మండల ప్రత్యేకాధికారి ఖాన్, డీపీవో దేవరాజు, ఆర్డీవో నర్సింహమూర్తి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, సర్పంచ్ రాజమణిగంగాధర్, కార్యదర్శి ప్రవీణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జనవరి 5 : బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ జిల్లా డైరెక్టర్ డాక్టర్ ఎం రవికుమార్ తెలిపారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని నిరుద్యోగులు ఈ నెల 8 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో bcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, డిగ్రీ ఉత్తీర్ణులై కులం, ఆదాయం, ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.





ఎన్టీపీసీలో ఆటో వద్ద న్యూజిలాండ్ దేశానికి చెందిన జాక్ కెనడీ, హవినీశ్ మైకల్‌సన్, జాయల్ హడ్స్

## ఆటోలో విదేశీయుల పర్యటన

**ఎన్టీపీసీకి చేరిన సాహస యాత్ర**

జ్యోతినగర్, జనవరి 5 : న్యూజిలాండ్ దేశానికి చెందిన ముగ్గురు ఆటోలో చేపట్టిన సాహసయాత్ర శుక్రవారం పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీకి చేరింది. న్యూజీలాండ్‌కు చెందిన జాక్ కెనడీ, హవినీశ్ మైకల్ సన్, జాయల్ హడ్స్ ముగ్గురు కేరళ నుంచి గౌహతికి ఆటోలో సాహస యాత్ర చేస్తున్నారు. ఆటోను వారే డ్రైవ్ చేసుకుంటూ వస్తున్నారు. భోజన విరామ సమయంలో ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో కొద్దిసేపు ఆగి సాన్వీ రెస్టారెంట్‌లో భోజనం చేశారు. ఈ సందర్భంగా వీరి ఆటో ప్రయాణం రామగుండంవాసులను ఆలోచింపజేయగా, 15 రోజుల పాటు జరిగే వీరి సాహసయాత్రను పలువురు ప్రశంసించారు.

## 9, 10న జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన

పెద్దపల్లి కమాన్, జనవరి 5 : జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 9, 10వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి డీఈవో డీ మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ ఆన్‌లైన్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆదేశాల మేరకు 'సమాజం కోసం శాస్త్ర సాంకేతికత' ప్రధాన అంశంగా ఆరోగ్యం, పర్యావరణహిత జీవన విధానం, వ్యవసాయం, కమ్యూనికేషన్, రవాణా వ్యవస్థ, కంప్యూటేషనల్ థింకింగ్ (5) ఉప అంశాల్లో విద్యార్థులు గైడ్ టీచర్ల సహకారంతో నమూనా ప్రాజెక్టులను రూపొందించాలని వివరించారు. విద్యార్థులు తమ ప్రాజెక్టును మూడు నిమిషాల లోపు నిడివితో క్లుప్తంగా వివరిస్తూ రూపొందించిన వీడియోను యూ-ట్యూబ్ (పబ్లిక్) లింక్, ఫొటో, సంక్షిప్త వివరణను ఈ నెల 9న సాయంత్రం 5 గంటల లోపు పంపాలని తెలిపారు. ఇప్పటికే నమోదు చేసుకున్న విద్యార్థులతో పాటు నూతన విద్యార్థులు సైతం గడువులోగా తమ వీడియోలను పంపాలని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి విధిగా కనీసం రెండు ఎగ్జిబిట్స్ రూపొందించి పాల్గొనాలని వివరించారు. 6 నుంచి 8వ తరగతుల విద్యార్థులు జూనియర్, 9వ, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను సీనియర్లుగా పరిగణిస్తామని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారి బీ రవినందన్‌రావును 99515 04622లో సంప్రదించాలని సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా విద్యార్థులకు 'ఆరోగ్యం-సుస్థిరమైన భూగ్రహం కోసం చిరుధాన్యాలు' అనే అంశంపై జూమ్ ద్వారా సెమినార్ కూడా నిర్వహిస్తున్నట్లు డీఈవో పేర్కొన్నారు.